క్లుప్తంగా

కొనసాగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

అల్లిపురం : ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియ 33వ వార్డులో ఆదివారం కూడా కొనసాగింది. ఎంజీఎం హైస్కూల్, బంగారుమెట్ట ప్రైమరీ స్కూళ్లలో జరిగిన కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలతో కలిసి వార్డు సీనియర్ నాయకుడు రంధి గోపీకృష్ణ పాల్గొని ఓటర్ల జాబితాలను పరిశీలించారు.

విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల గీతా ప్రచార సమితి కార్యాలయంలో గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు ఆదివారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు పఠించడం వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా అందించిన సందేశాన్ని ఆచరించి జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలన్నారు. పోటీలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పలువురు సంస్కృత పండితులు వ్యవహరించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, గీతా ప్రచార సమితి సభ్యులు, మహిళలు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ఆశ కార్యకర్తల సమస్యలపై ధర్నా

డాబాగార్డెన్స్ : ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద మహా ధర్నాలు నిర్వహించనున్నట్టు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. మహాధర్నాలు విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో ఆశ కార్యాకర్తల విశాఖ జిల్లా కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు ఎస్. పద్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆశ యూనియన్ కార్యదర్శి మేరీ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని, ఫోన్ యాప్‌లో పని చేసేందుకు తగిన శిక్షణ ఇవ్వాలని పలు డిమాండ్ల సాధనకు 36 గంటల మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తుపాను హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తం



నిర్మానుష్యంగా సీతమ్మధార ప్రధాన రహదారి

సీతమ్మధార: మిచాంగ్ తుపాను హెచ్చరికలతో నగర ప్రజలు అప్రమత్తమయ్యారు. కూరగాయలు, కిరాణాసామగ్రి వంటి నిత్యావసర వస్తువులను ఉదయమే కొనుగోలు చేసుకున్నారు. సీతమ్మధార రైతుబజారులో ఉదయం 10 గంటలకే కూరగాయలు అయిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే ఈదురుగాలులు వీయడంతో ప్రజలు చాలావరకు ఇంటికే పరిమితమయ్యారు.



నాడు

గతంలో పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని వారి గుడిసెలను పీకి పడేశారు. ఏళ్లు గడిచినా తిరిగి ఇళ్లు నిర్మించిన దాఖలాలు లేవు. ఎన్నిసార్లు అధికారులను కలిసినా ఫలితం ఉండేది కాదు. దీంతో పేదలు లబోదిబోమనేవారు. తమ సమస్యకు పరిష్కారం ఎప్పుడా అని నిరీక్షించేవారు.

నేడు

గతంలో అన్యాయానికి గురైన పేదలను జగనన్న ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. వారికి నేనున్నాను అంటూ టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. సకల సౌకర్యాలతో జగనన్న ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లను చూసి లబ్ధిదారులు సంతోషంతో సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం ఇలా..

సీహార్స్ జంక్షన్‌లో మొత్తం ఇళ్లు **72**	ఇళ్ల నిర్మాణ వ్యయం రూ. **6.09** కోట్లు	చిలకపేటలో మొత్తం ఇళ్లు **64**
ఇళ్ల నిర్మాణ వ్యయం రూ.**4.9** కోట్లు	ఒక్కొక్క లబ్ధిదారు చెల్లించాల్సిన మొత్తం రూ. **7.56** లక్షలు	సీహార్స్ జంక్షన్, చిలకపేట రెండు చోట్ల కలిపి మొత్తం టిడ్కో ఇళ్లు **136**

పేదల పొదరిళ్లు

- గుడిసెల నుంచి కలల పొదరిళ్లలోకి
- సకల సదుపాయాలతో టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చిన జగనన్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



చిలకపేటలో తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల బ్లాక్

జగదాంబ : నగర శివారు ప్రాంతాల్లో ఇళ్లు లేకుండా ఉండే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించి ప్రభుత్వం ఆదర్శ గ్రామాలను ఏర్పాటు చేసింది. దీనిద్వారా వందలాది కుటుంబాలకు నీడ దొరికింది. కేవలం ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాకుండా ఆ ఇళ్లకు వాటర్ కనెక్షన్, ఎలక్ట్రికల్, యూజీడీ అనుసంధానం వంటి సకల సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది.

టీడీపీ హయాంలో రోడ్డున పడేశారు..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీహార్స్ జంక్షన్‌లో నివాసం ఉంటున్న 36 కుంటుబాలను నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడేశారు. ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఉన్న పళంగా వారి గుడిసెలు పీకించారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని చాలా మంది చెల్లాచెదురు అయిపోయారు. ఇలా తొమిదేళ్లు గడిచిపోయాయి. చిలకపేటలో కూడా ఇదే దుస్థితి.

ఆదుకున్న జగనన్న ప్రభుత్వం..

ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరాశ్రయులను ఆదుకుంది. నియోజకవర్గంలో జీవీఎంసీ 35, 39 వార్డుల్లో సీహార్స్ జంక్షన్ ఏరియాలో టిడ్కో ఇళ్ల నిర్మాణం తలపెట్టింది. మూడు బ్లాకుల్లో 72 ఇళ్లు నిర్మించింది. అలాగే చిలకపేటలో రెండ్లు బ్లాకుల్లో 64 టిడ్కో ఇళ్లు నిర్మించింది. రెండు చోట్ల ఇళ్లలో అన్ని వసతులు కల్పించారు.

నిర్మాణాలు ఇలా..

సీహార్స్ జంక్షన్‌లో 24 ఇళ్లు 356 చదరపు గజాలుగా నిర్మించారు. ఒక్కొక్క ఇంటి ధర రూ. 7.65 లక్షలు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 4 లక్షలు సబ్సిడీ ఇస్తున్నాయి. లబ్ధిదారులు కేవలం రూ. 50 వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన సొమ్మును ప్రభుత్వం బ్యాంకర్లతో మాట్లాడి రుణంగా ఇప్పించింది. మిగిలిన 48 ఇళ్లు 430 గజాల చొప్పున నిర్మించారు. ఒక్కో ఇంటి ధర రూ. 8.55 లక్షలుగా నిర్ణయించారు. వీటికి కూడా సబ్సిడీ, బ్యాంకు రుణం వర్తిస్తాయి. లబ్ధిదారు రూ. 50 వేలు చెల్లించాలి.

> పేద వాడి సొంతింటి కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాం లోనే నేరవేరింది. అతి తక్కువ ధరకు అన్ని వసతులతో ఇళ్లను తీర్చిదిద్ది ఇచ్చారు. అర్హులైన ఏ ఒక్కరు ఇల్లు లేక బాధపడకూడదని సీఎం టిడ్కో ఇళ్లను పేదలకు కేటాయించారు. ఇందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తమ కోసం ఆలోచిస్తున్న సీఎం ఔదార్యానికి పేదలు ఆయనకు వేనోళ్ల జేజేలు పలుకుతున్నారు.



సీహార్స్ జంక్షన్‌లో జగనన్న పేదలకు నిర్మించి ఇచ్చిన టిడ్కో ఇళ్లు

చిలకపేటలో..

చిలకపేటలో ఒక్కో ఇల్లు 356 గజాల్లో నిర్మించారు. ఇక్కడ మొత్తం 64 ఇళ్ల నిర్మాణం జరిగింది. లబ్ధిదారులు రూ. 50 వేలు మాత్రమే చెల్లిస్తే మిగిన సొమ్ములో రూ. 4 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన రూ. 3 లక్షల పైచిలుకు బ్యాంకు రుణం అందుతుంది.

ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్..

జగనన్న ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లకు కేవలం ఒక్క రూపాయితోనే రిజిస్ట్రేషన్ చేయాలని జగనన్న ఇచ్చిన ఆదేశాలతో ఆ మేరకే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. పేదవాడికి భారం కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజలు హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ మా సీఎం జగనన్నే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని రుజువు చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారు. ముఖ్యంగా పేదలకు ఇళ్లు ఇవ్వడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాలేదు. జగనన్నతోనే సాధ్యమైంది. మళ్లీ మా సీఎం జగనన్నే.

–బొడ్డేపల్లి శ్రీనివాసరావు, టిడ్కో నివాసదారు, సీహార్స్ జంక్షన్ జీవీఎంసీ 35వ వార్డు

జగనన్న ఇల్లిచ్చి ఆదుకున్నారు..



నాడు టీడీపీ ప్రభుత్వం ఉన్న పళంగా రోడ్డున పడేసింది. దాదాపు తొమ్మిదేళ్ల పాటు నానా పాట్లు పడ్డాం. నేడు జగనన్న టిడ్కో ఇళ్లు నిర్మించి గూడు కల్పించారు. ఆయన చేసిన మేలు ఎప్పటికీ ఎప్పటికీ మర్చిపోము.

– యాండ్రి సన్యాసిరావు, చిలకపేట, జీవీఎంసీ 39వ వార్డు

చాలా సంతోషంగా ఉంది..



సీ హార్స్ జంక్షన్‌లో సుమారు 30 ఏళ్లగా నివసిస్తున్నాం. మాకు ఇల్లు కట్టించి ఇస్తామని మమ్మల్ని ఉన్న పళంగా ఖాళీ చేయించారు. ఇళ్లు మాత్రం కట్టలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ఉపయోగం లేకపోయింది. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇళ్లు కట్టించి ఇచ్చారు. ఆయనకు ధన్యవాదాలు.

–వియ్యపు అప్పలకొండ, చిలకపేట, జీవీఎంసీ 39వ వార్డు

జగనన్న చొరవతో అందరం ఒక్క చోట చేరాం..



సుమారు 14 సంత్సరాల కిందట ఒకే దగ్గర ఉన్న వాళ్లం అందరం విడిపోయాం. మళ్లీ కలుస్తామని అనుకోలేదు. జగనన్న చొరవతో ఒక్కచోటే ఇళ్లు మంజూరై మళ్లీ కలిసాం. చాలా సంతోషంగా ఉంది. నీడనిచ్చిన జగనన్నను జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం.

–వియ్యపు నర్సింహమూర్తి, సీహార్స్‌జంక్షన్, జీవీఎంసీ 35వవార్డు

'ఒంటి కాలు పరుగు' పుస్తకావిష్కరణ



సాహితీ సభలో మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మహారాణిపేట : తెలుగు భాష, సాహిత్యాలను పరిపుష్టం చేస్తూ రచనలు చేసిన ఘనత డాక్టర్ బండి సత్యనారాయణ సొంతమని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన ఒంటి కాలు పరుగు కవిత్వ సంపుటిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప రచనలు చేశారన్నారు. సామాజిక స్పృహతో మానవీయ కోణంలో ఆయన రచనలు ఉంటాయన్నారు. స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కవితలు రాశారని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా కవితలు రాసే వారిని ప్రొత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి కార్యక్రమాల విభాగాధిపతి బేతా రామ సూర్య ప్రకాశరావు, ప్రముఖ కవి, రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, మేనేజర్ పి.ఎ.రాజు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకం.. పుస్తక పఠనం

మహారాణిపేట : పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు ప్రపంచ చరిత్ర తెలుసుకునే అవకాశం కలుగుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంట్లో చిన్న లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలాంటి ప్రదర్శనలకు పిల్లలను తీసుకు రావాలన్నారు. వారికి నచ్చిన పుస్తకాలు కొనుగోలు చేసుకునే అవకాశాన్ని తల్లిదండ్రులు కల్పించాలన్నారు.



పుస్తకాలు తిలకిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఇలాంటి ప్రదర్శనల్లో ఎక్కువ పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పి.ఎ. రాజు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవే మాధవసేవ



మాట్లాడుతున్న రామకృష్ణ మిషన్ కార్యదర్శి విద్యానందీశ్వర స్వామి

మహారాణిపేట : దివ్యాంగుల సేవే మాధవసేవ అని రామకృష్ణ మిషన్ కార్యదర్శి విద్యానందీశ్వర స్వామి అన్నారు. ఆదివారం ఆలీమ్ కో దివ్యాంగ బాలలకు ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన గుర్తింపు శిబిరంలో ఆయన మాట్లాడారు. సెలీబ్రల్ పాలసీ క్లినిక్‌లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యానందీశ్వర స్వామి చిన్నారులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జీవీఎంసీ జోన్-4 జెడ్సీ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విశిష్ట అతిథి, బీజేపీ నాయకుడు ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నరేంద్రప్రకాష్, జీవీఎంసీ ఏపీడీ పుణ్యవతి, కార్యక్రమ కోఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ఆలీమ్ కో ప్రతినిధులు డాక్టర్ శ్వేత, సుమారు 250 మందికి పైగా దివ్యాంగ బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

17న దివంగత నటుడు శోభన్‌బాబు విగ్రహావిష్కరణ



ఆహ్వానపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : అందాల కథానాయకుడు శోభన్ బాబు కాంస్య విగ్రహం ఈ నెల 17న ఆవిష్కరించనున్నట్టు విగ్రహ నిర్మాణ కమిటీ నిర్వాహకులు, శోభన్‌బాబు పర్సనల్ మేనేజర్ ఎస్ఎన్ రావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోగ్గాడిగా అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబును స్మరించుకుంటూ నగరంలోని డాబాగార్డెన్స్ జంక్షన్‌లో ఈ నెల 17న కాంస్య విగ్రహం ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శోభన్‌బాబు అభిమానులు, కమిటీ సభ్యులు కె. కనకరాజు, దసపల్లా హోటల్ మేనేజర్ బెహరా ప్రసాద్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, గువ్వల రమణ, జె. త్రిమూర్తులు, కె. శోభన్‌బాబు, ఆడిన నాగరాజు, బి. కుమార్, ఓవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలలను ఆకట్టుకున్న కథలు

సీతంపేట: స్థానిక పౌరగ్రంథాలయంలో మియావాకీ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం ఉదయం స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం జరిగింది. ముంబైకి చెందిన బాలల రచయిత్రి కేటీ బాగ్లీ వర్చువల్ విధానంలో ఆసక్తికర కథనాలతో పిల్లలను ఆకట్టుకున్నారు. 8 నుంచి 13 ఏళ్ల వయసు పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సెషన్‌లో ఆమె కథలకు జీవం పోశారు. ఈ సెషన్‌లో రెండు కథల పుస్తకాలను ప్రదర్శించారు. కథల ద్వారా వినోదంతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పౌరగ్రంథాలయం, భారతీయ విద్యాభవన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.



ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

అలరించిన వినోదాల విందు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, యం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్ రాజు, రాణి, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, గోపీ నాయుడు, నేహ, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ నవ్వులు పూయించాయి. ముందుగా దుర్గాప్రసాద్ చేసిన కామెడీ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, శివప్రసాద్, నందూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, బాందంగీర్ సాయి, సన్‌మూర్తి పాల్గొని కళాకారులను సత్కరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, భక్తులు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శ శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు అర్జీలు పెట్టుకోవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

కాలేజీల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలోని జూనియర్ కాలేజీల నిర్వాహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీవీఈవో బి.రాధ ఒక ప్రకటనలో సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టకూడదని, లీకేజీలు ఉన్న గదుల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. నాడు-నేడు పనులు జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెటీరియల్ పాడవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన 1025వ రోజు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇండియన్ ఆర్మీ క్విజ్ పోటీల్లో ప్రతిభ

ఉక్కునగరం: ఇండియన్ ఆర్మీ క్విజ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ డీపాల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం న్యూఢిల్లీలో ఈ క్విజ్ పోటీలు నిర్వహించారు. సికింద్రాబాద్‌లో జరిగిన టైర్-1 పోటీల్లో 216 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతలుగా నిలిచిన డీపాల్ విద్యార్థులు చెన్నైలో జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఐదోస్థానం సొంతం చేసుకున్నారు. రౌనక్ సిద్ధిఖ్, అల్సన్ జోసెఫ్, చైతన్య నరేష్, నిరంజన్‌లకు రూ.2,90,000 చెక్కు, శాంసంగ్ ట్యాబ్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.